

భక్తుల కోర్కెలు తీర్చే శ్రీలక్ష్మీనారసింహుడు

గుర్రంకొండ మండలం తరిగొండలోని లక్ష్మీనారసింహ స్వామివారి బ్రహ్మోత్సవాలు ఈ నెల 16 నుంచి 25 వరకు జరగనున్నాయి.. -10లో



	ఇఫ్తార్ శుక్ర (సా॥)	సహర్ శని (ఉ॥)
రాయచోటి	6.30	5.06
రాజంపేట	6.30	5.04
పీలేరు	6.31	5.02
మదనపల్లె	6.31	5.08

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.210	రూ.280
రెండోరకం	రూ.110	రూ.190



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 47 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	240	430
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 134.500 కిలోలు

న్యూస్‌రీల్

ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలపై నేడు సమీక్ష సమావేశం

ఒంటిమిట్ట: ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలకు సంబంధించి శుక్రవారం టీటీడీ అధికారులతో జేఈఓ వీరబ్రహ్మం సమీక్ష సమావేశం నిర్వహిస్తారని ఆలయ డిప్యూటీ ఈఓ నరేష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలకు సంబంధించి జరుగుతున్న పనులను పరిశీలించి, అభివృద్ధి పనులపై అధికారులతో చర్చిస్తారని తెలిపారు.

వైఎస్సార్‌సీపీ డాక్టర్ల విభాగం అధ్యక్షుడిగా అనిల్‌కుమార్‌రెడ్డి



మదనపల్లె సిటీ: వైఎస్సార్‌సీపీ డాక్టర్ల విభాగం జిల్లా అధ్యక్షుడిగా మదనపల్లెకు చెందిన దంతవైద్యుడు డాక్టర్ ఇందుకూరి అనిల్‌కుమార్‌రెడ్డిని నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. అనిల్‌కుమార్‌రెడ్డి మొదటి నుంచి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. ఆయన సేవలను గుర్తిస్తూ పార్టీ జిల్లా డాక్టర్ల విభాగం అధ్యక్షుడిగా నియమించారు. ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తానన్నారు.

రాయచోటి కోర్టు జడ్జికి డాక్టరేట్



డాక్టరేట్ పట్టాను స్వీకరిస్తున్న న్యాయమూర్తి ప్రసన్న

రాయచోటి టౌన్: రాయచోటి కోర్టులో సీనియర్ సివిల్ జడ్జిగా విధులు నిర్వహిస్తున్న ప్రసన్నకు శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం న్యాయశాఖ విభాగం తరఫున డాక్టరేట్ ప్రదానం చేశారు. ది ప్రాబ్లమ్ ఆఫ్ హ్యూమన్ ట్రాఫికింగ్ ఆఫ్ ఉమెన్ అండ్ చిల్డ్రన్ అనే అంశంపై ఈమె చేసిన పరిశోధనకు ఈ డాక్టరేట్ లభించింది. ఈనెల 7వ తేదీన ఆమె డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా గురువారం ఆమెను రాయచోటి కోర్టు సిబ్బంది, న్యాయవాదులు అభినందించారు.

ఆర్ట్ మాస్టర్‌కు అవార్డు



ఆర్ట్ మాస్టర్ ఆనందరాజు

రామాపురం: డాక్టర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో ఆర్ట్ మాస్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆనందరాజు చిత్రకళా బ్రహ్మ అవార్డుతో పాటు స్వర్ణ కంకణం అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వరప్రసాద్ గురువారం తెలిపారు. ఈనెల 10వ తేదీన హరిహర కళా నిలయంలో జరిగిన సదస్సులో ఆనందరాజుకు ఈమేరకు సత్కారం లభించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది ఆయనను అభినందించారు.

యువ క్రికెటర్‌కు ప్రభుత్వం అండ



రూ.10 లక్షల చెక్కును క్రీడాకారిణి గాయత్రికి అందజేస్తున్న ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా

కడప స్పోర్ట్స్: 'ఆడుదాం ఆంధ్ర' రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి టాలెంట్‌హంట్‌కు ఎంపికైన వైఎస్‌ఆర్ జిల్లా పులివెందుల జేఎన్‌టీయూ కళాశాల బీటెక్ విద్యార్థిని గాయత్రికి ప్రభుత్వం అండగా నిలిచింది. టాప్–14 టాలెంట్ ప్లేయర్స్ జాబితాలో చోటు దక్కించుకున్న యువ క్రికెటర్‌కు ప్రభుత్వం రూ.10 లక్షలు మంజూరు చేసింది. ఆమెకు రూ.10 లక్షల చెక్కును డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అందజేశారు.

విద్యార్థులకు అభినందన

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్–2023 ప్రదర్శనలో ప్రతిభను చాటి జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థులను పాఠశాల విద్య ఆర్‌జేడీ ఎద్దుల రాఘవరెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి మర్రెడ్డి అనురాధ, కడప డిప్యూటీ డీఈఓ రాజగోపాల్‌రెడ్డిలు అభినందించారు. ఈనెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు చిత్తూరు జిల్లా పలమనేరులో నిర్వహించిన ఏపీ ఇన్‌స్పైర్ మనాక్ రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రొద్దుటూరు ఢిల్లీ పబ్లిక్‌స్కూల్‌కు చెందిన షేక్ అసిఫా(అలారంటు ప్రొటెక్టు లైఫ్ అండ్ లింబ్స్) కడప నాగార్జున మోడల్ స్కూల్‌కు చెందిన అభిలాస్(ఫ్రూట్ ఐడెంటీ ఫైర్) హితేష్‌జైన్(విజన్ అలెర్ట్ ఫర్ స్టూడెంట్), కమలాపురం ఏపీ బీసీ బ్ల్యూఈఐఎస్‌కు చెందిన రుగ్వేద్‌వర్మ (ఐఓటీ స్మార్ట్ మిర్రర్ విత్ న్యూస్ అండ్ టెంపరేచర్) తమ ప్రాజెక్టులను ప్రదర్శించి రాణించారు.

కస్తూర్బా బడి.. అడ్మిషన్లు రెడీ

- కార్పొరేట్‌కు దీటుగా కస్తూర్బా పాఠశాల
- అత్యుత్తమ విద్యాబోధన
- ఉచిత వసతి సదుపాయం
- ఏప్రిల్ 11 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ



తంబళ్లపల్లెలోని కస్తూర్బాగాంధీ విద్యాలయం



మదనపల్లె సిటీ: కార్పొరేట్‌కు దీటైన వసతులు.. అంతర్జాతీయ స్థాయి విద్యాప్రమాణాలు.. ఇంగ్లీష్ మాధ్యమంలో బోధనలు...పేదలు, అనాథలు, బడిబయట పిల్లలకు అడ్మిషన్లు...విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలను ప్రారంభించారు. 6 నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుకు భరోసా ఇస్తున్నారు. బాలికలు సమాజంలో ఎలా మెలగాలో అవగాహన కల్పిస్తున్నారు. విలువలను పెంపొందించుకునేలా వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహిస్తున్నారు. అభ్యసన నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 22 కేజీబీవీల్లో 2024–25 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లకు నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ మేరకు ఈనెల 12 నుంచి ఏప్రిల్ 11 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు అవకాశం కల్పించింది. సీట్ల భర్తీలో నిబంధనల మేరకు ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కేటగిరీ వారీగా ప్రాధాన్యత ఇస్తారు. ఈ విద్యాలయాల్లో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా వసతులు కల్పించారు. విద్యార్థినులకు అత్యుత్తమ బోధనను అందుబాటులోకి తీసుకువచ్చారు.



జిల్లాలో కేజీబీవీల సంఖ్య : 22

ప్రత్యేక అధికారులు : 22

సెక్షన్‌కు సీట్లు : 40

- 6వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంతో పాటు 7,8,9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు అడ్మిషన్లు జరుగుతాయి. దరఖాస్తును హెచ్‌టీటీపీఎస్://ఏపీకేజీబీవీ. ఏపీసీఎఫ్‌ఎస్‌ఎస్.ఐఎన్ సైట్ ద్వారా పొందవచ్చు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ మెసేజ్ ద్వారా సమాచారం అందుతుంది. ఇందు కోసం రాష్ట్ర విద్యాశాఖ ప్రత్యేక మార్గదర్శకాలను రూపొందించింది.

కేజీబీవీ ప్రత్యేకతలు

బాలికల్లో ఆత్మస్థైర్యం పెంపొందించేందుకు వారంలో రెండు రోజుల పాటు స్వీయ రక్షణ లక్ష్యంగా కరాటే తరగతులు నిర్వహిస్తారు. కేజీబీవీల్లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు ఏటా ప్రతిభా అవార్డులను గెలుచుకుంటున్నారు. బాలికలకు కాస్మోటిక్ కిట్స్, నాప్‌కిన్స్‌లతో పాటు రెండు జతల యూనిఫాం ప్రభుత్వం అందిస్తోంది. కేజీబీవీ పాఠశాలల్లో బాలికల భద్రత కోసం వాచ్‌మెన్ నుంచి ప్రత్యేకాధికారి వరకు అందరూ మహిళా ఉద్యోగులే ఉంటారు.

తరగతికి 40 మందే..



- కేజీబీవీలో 6 నుంచి 10వ తరగతి వరకు ఒక్కో తరగతికి 40 సీట్ల చొప్పున కేటాయించారు.
- ఇంటర్మీడియట్‌కు సంబంధించి ఒక్కో కేజీబీవీలో ఒక్కో గ్రూపును ప్రవేశపెట్టారు. 40 సీట్ల చొప్పున అడ్మిషన్లు ఉంటాయి.
- ఆటలు, కరాటేలకు ప్రాధాన్యత ఇస్తారు. ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ శిక్షణ ఇస్తారు.
- ఆరోగ్యం, నైతిక విలువలను పెంపొందించేలా వ్యక్తిత్వ వికాసం తరగతులను నిర్వహిస్తారు.
- ప్రతి కేజీబీవీలో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను పరీక్షించేందుకు ఒక ఏఎస్ఎం ఉంటారు.
- విద్యలో వెనుకబడిన వారిలో అభ్యసన నైపుణ్యాలను పెంపొందించేందుకు కృషి చేస్తారు.
- కంప్యూటర్, వ్యాయామం, ఆరోగ్యం, వృత్తి నైపుణ్య విద్యను అందించడం ద్వారా బాలికల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేస్తారు.
- పదో తరగతి పూర్తి చేసుకున్న వారు ఉన్నత చదువులకు వెళ్లేలా ప్రోత్సహిస్తారు. అందులో భాగంగా కేజీబీవీల్లో ఇంటర్మీడియట్‌ను ప్రవేశపెట్టారు.

అవకాశం సద్వినియోగం చేసుకోవాలి



జిల్లాలో కేజీబీవీ పాఠశాలల్లో అడ్మిషన్లకు నోటిఫికేషన్ ఇచ్చారు. విద్యార్థినులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇచ్చారు. పేద, అనాథ, బడిబయట పిల్లలు, బడిమానేసిన బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు.

– రాధమ్మ, జీసీడీఓ, సమగ్రశిక్ష

కార్పొరేట్‌కు దీటుగా విద్యాబోధన



కేజీబీవీ పాఠశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా విద్యాబోధన సాగుతోంది. మంచి భవనాలు, మౌలిక సదుపాయాలు, విద్యార్థులకు స్మార్ట్ డిజిటల్ తరగతుల ద్వారా బోధన ఉంటుంది. బాలికలకు భరోసాగా నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నాం. చదువుతో పాటు క్రీడలు, ఇతర నైపుణ్యాలకు మెరుగులు దిద్దుతాం.

–శ్రీమతి, ప్రత్యేక అధికారిణి, కేజీబీవీ, తంబళ్లపల్లె

అన్ని వసతులతో కూడిన ఉత్తమ విద్య



కేజీబీవీలో అన్ని వసతులతో కూడిన ఉత్తమ విద్యాబోధన జరుగుతోంది. ప్రైవేటు పాఠశాలల కంటే మెరుగైన విద్య కల్పిస్తున్నారు. నాణ్యమైన భోజనం, పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో మేము విద్యను అభ్యసిస్తున్నాం.

– మౌనిక, 10వతరగతి విద్యార్థిని, కేజీబీవీ, పీటీఎం

ఆర్టీసీకి రూ. 12.76 లక్షల ఆదాయం

కడప కోటిరెడ్డిసర్కిల్: లక్కిరెడ్డిపల్లె గంగమ్మ జాతర సందర్భంగా ఈనెల 11వ తేదీన జిల్లాలోని కడప, పులివెందుల డిపోల నుంచి 43 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసి 18,713 కిలోమీటర్లు తిప్పడం ద్వారా రూ. 12,76,844 ఆదాయం వచ్చినట్లు జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. కడప డిపో నుంచి 23 బస్సుల ద్వారా 9369 కిలోమీటర్లు తిప్పడం ద్వారా రూ. 6,48,009, పులివెందుల డిపో నుంచి 20 బస్సు 9344 కిలోమీటర్లు ప్రయాణించడం ద్వారా రూ. 6,28,835ల ఆదాయం వచ్చిందన్నారు. ఆర్టీసీ బస్సులను ఆదరించి ప్రయాణం చేసి ఆదాయం రావడానికి తోడ్పడిన భక్తులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు.

తలనీలాల వేలం.. రూ.65లక్షల ఆదాయం



వేలం పాట నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

వేంపల్లె: చక్రాయపేట మండలంలోని గండి క్షేత్రం దేవస్థానానికి సంబంధించి తలనీలాల వేలం ద్వారా రూ.65.11లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ అసిస్టెంట్ కమిషనర్ అలవలపాటి ముకుందారెడ్డి తెలిపారు. గురువారం నలుగురు సభ్యులు వేలంపాటలో పాల్గొనగా సికింద్రాబాద్‌కు చెందిన మదర్ హ్యూమన్ హెయిర్ ఎంటర్ ప్రైజెస్ ప్రొప్రైటర్ ఆదినారాయణ దక్కించుకున్నారు. గతంలో తలనీలాలకు రూ.55లక్షలు పాడగా ప్రస్తుతం రూ.10లక్షలు అధికంగా పాడారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ మాట్లాడుతూ గండి క్షేత్రం అభివృద్ధికి మరింత కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో దేవదాయశాఖ తనిఖీదారు రమణ, ప్రధాన అర్చకులు కేసరి, ఉపప్రధాన అర్చకులు రాజస్వామి పాల్గొన్నారు.

వైఎస్ జగన్ ప్రభుత్వంలోనే బీసీలకు న్యాయం

- ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, డిప్యూటీ సీఎం అంజద్‌బాషా
- రూ.6.25 కోట్ల ఎంపీ లాండ్స్ నిధులతో అన్ని హంగులతో బీసీ భవనం నిర్మాణం



మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, చిత్రంలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా తదితరులు

కడప రూరల్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే బీసీలకు న్యాయం జరుగుతోందని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజాద్ బాషాలు తెలిపారు. గురువారం ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో రూ 6.25 కోట్ల ఎంపీ లాండ్స్ నిధులతో గురువారం కడపలోని పాత రిమ్స్‌లో నిర్మించిన బీసీ భవన్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ బీసీల చిరకాల కోరిక నెరవేరినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఒకటిన్నర ఏడాది కిందట ఈ స్థలానికి భూమి పూజ చేశామని, సరిగ్గా 18 మాసాలకు బీసీ భవనం పూర్తి చేసి బీసీలకు అందజేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశానుసారం ఎంపీ లాండ్స్ నిధుల నుంచి రూ.6.25 కోట్ల ఖర్చు చేసి ఈ బీసీ భవనం నిర్మాణం చేసినట్లు చెప్పారు.

- ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజాద్ బాషా మాట్లాడుతూ బీసీ భవన్ వచ్చేందుకు ముఖ్య కారకులు ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, కడప నగర మేయర్ కే సురేష్ బాబు, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌లని అన్నారు. ఈ బీసీ భవనంలో ఒక లైబ్రరీని కూడా నిర్మాణం చేయనున్నట్లు చెప్పారు.
- కడప నగర మేయర్ సురేష్ బాబు మాట్లాడుతూ బీసీల కొన్ని ఏళ్ల కల నేటికి సాకరమైందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు రామచంద్రారెడ్డి, రమేష్ యాదవ్, డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య యాదవ్, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ మహేశ్వర్ రెడ్డి, ఈఈ ప్రభాకర్ నాయుడు, డి ఈ కళ్యాణి, ఏ ఈ శ్రీహరి, కార్పొరేటర్లు, నాయకులు బంగారు నాగయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఈబీసీ నేస్తంతో మహిళల ఆర్థికాభివృద్ధి

- జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్
- 23287 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ. 34.93 కోట్లు జమ



మెగా చెక్కును మహిళలకు అందజేస్తున్న జేసీ, ఇతర ఉన్నతాధికారులు

రాయచోటి: వైఎస్సార్ ఈబీసీ నేస్తం ద్వారా మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ పేర్కొన్నారు. గురువారం నంద్యాల జిల్లా బనగానపల్లె నుంచి వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకం కింద 45 నుంచి 60 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్న అర్హులైన అగ్రవర్ణాలకు చెందిన అక్కా చెల్లెమ్మలకు మూడో విడత ఆర్థిక సాయాన్ని బటన్ నొక్కి నేరుగా వారి ఖాతాలలో జమచేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రారంభించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, బీసీ సంక్షేమశాఖ అధికారి సందప్ప, బీసీ కార్పొరేషన్ ఏఈఓ శిరీషా, బీసీ కార్పొరేషన్ సీనియర్ నాయకులు ఓబులేసు, మహిళలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన రెడ్డి, కమ్మ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, క్షత్రియ, వెలమలతో పాటు ఇతర ఓసీ సామాజిక వర్గాలకు చెందిన అర్హులైన పేద మహిళలకు వైఎస్సార్ ఈబీసీ నేస్తం పథకం ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ప్రభుత్వం ద్వారా ఆర్థిక సహాయం అందుకున్న మహిళలు సొంత వ్యాపారాలు చేసుకొని ఆర్థికాభివృద్ధి చెందాలన్నారు. ప్రతి మహిళ ముఖంలో చిరునవ్వు, వారి కుటుంబంలో సంతోషం వెల్లివిరిసేందుకు ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. అర్హులందరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి చెందాలన్నారు. అన్నమయ్య జిల్లాలో 23287 మంది మహిళలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా రూ. 34.93 కోట్ల మెగా చెక్కును అందజేశారు.

పది పరీక్షలకు పదండిలా..!

- తొలిసారిగా పబ్లిక్ పరీక్షలు రాస్తున్న విద్యార్థుల్లో ఎన్నో సందేహాలు
- పరీక్ష కేంద్రంలో పాటించాల్సిన నిబంధనలపై ప్రభుత్వ మార్గదర్శకాలు
- ఈనెల 18 నుంచి 30 వరకు జరగనున్న పరీక్షలు




తరగతి గదిలో పదో తరగతి విద్యార్థులు

మదనపల్లె సిటీ: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మరో వారం రోజుల్లో ప్రారంభం కానున్నాయి. టెన్త్ విద్యార్థులు తొలిసారిగా పబ్లిక్ పరీక్షలకు హాజరు కానున్నారు. చదువుతున్న పాఠశాలకు దూరంగా కొత్తగా కేటాయించిన కేంద్రానికి వెళ్లి, పరీక్ష రాయాల్సిన విద్యార్థుల్లో ఎన్నో సందేహాలు, ప్రశ్నలు ఉత్పన్నమవుతాయి. దీనిని దృష్టిలో ఉంచుకున్న ప్రభుత్వ పరీక్షల విభాగం విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సూచనలతో ముద్రించింది. ఈనెల 18 నుంచి 30వతేదీ వరకు జరగనున్న పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా 25,522 మంది హాజరు కానున్నారు. వీరి కోసం 129 కేంద్రాలను సిద్ధం చేశారు. హాల్ టికెట్లు పొందిన విద్యార్థులు ఆయా పరీక్ష కేంద్రాలను తమ తల్లిదండ్రులతో పాటు సందర్శించడం ఉత్తమం.

విద్యార్థులూ..వీటిని పాటించండి

- ఉదయం 8.30 గంటల కల్లా కచ్చితంగా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి.
- ఉదయం 8.45 నుంచి 9.30 వరకు కేంద్రాల్లోకి అనుమతిస్తారు. 9.30 తరువాత గేట్లు మూసి వేసిన తరువాత ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరు.



- హాల్‌టక్కెట్లు పొందిన విద్యార్థులు దానిపై ముద్రించిన తమ వివరాలు, పుట్టిన తేదీ, తల్లిదండ్రుల పేర్లు, రాయాల్సిన సబ్జెక్టులు, పరీక్ష కేంద్రం పేరు, చిరునామా సరి చూసుకోవాలి. వాటిలో ఏమైనా తప్పులు ఉన్నట్లయితే ముందుగానే తాము చదువుతున్న పాఠశాల ప్రధానోపాధ్యాయుల ద్వారా ప్రభుత్వ పరీక్షల విభాగం దృష్టికి తీసుకెళ్లి, సరి చేయించుకోవాలి.

క్వశ్చన్ పేపర్‌పై ఏడు అంకెలతో కూడిన ప్రత్యేక కోడ్ ఉంటుంది. హాల్‌టిక్కెట్‌పై ఉన్న ఎన్‌రోల్‌మెంట్ నంబర్ ఆధారంగా కేటాయించిన రూముల వారీగా విద్యార్థులను కూర్చోబెడతారు. బార్ కోడింగ్ విధానంలో రూపొందించిన ఓఎంఆర్ షీట్లను విద్యార్థుల రోల్ నంబర్ ఆధారంగా పంపిణీ చేస్తారు.

- రోల్ నంబర్ ఆధారంగా విద్యార్థి తనకు కేటాయించిన సీట్లో కూర్చున్న తరువాత ఇన్విజిలేటర్ వచ్చి బార్ కోడింగ్‌తో కూడిన ఓఎంఆర్ షీట్, ప్రశ్నాపత్రం, ఆన్సర్ బుక్‌లెట్ అందజేస్తారు. తర్వాత ఓఎంఆర్ షీట్‌ను ఇన్విజిలేటర్ ఇచ్చే సూచనలు పాటిస్తూ జాగ్రత్తగా పూరించాలి. దానిపై అనవసరమైన గీతలు, రాతలు రాయరాదు.
- ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభమైన తరువాత, మధ్యాహ్నం 12.45 గంటలకు పరీక్ష ముగిసేవరకు విద్యార్థులను బయటకు వెళ్లనివ్వరు. గుర్తింపుకార్డు కలిగి, పరీక్షల విధుల్లో ఉన్న అధికారులు, స్క్వాడ్ బృందాలను పరీక్ష కేంద్రాల్లోకి తనిఖీలకు అనుమతిస్తారు.

తప్పుడు ప్రచారాలు నమ్మవద్దు

- ప్రశ్నాపత్నం లీక్ అయిందని, పరీక్ష కేంద్రం నుంచి బయటకు వచ్చిందని కొందరు పనిగట్టుకుని చేసే ప్రచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మకుండా, విద్యార్థులు పరీక్షలకు ప్రశాంతంగా హాజరు కావాలి. ఒక వేళ ఏదైనా సెంటర్ నుంచి ప్రశ్నాపత్రం లీకేజీకి గురైతే అది ఎక్కడ జరిగిందో గుర్తించే విధానాన్ని ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది.
- పరీక్ష కేంద్రంలో పక్క,పక్కన కూర్చునే ఏ ఇద్దరు విద్యార్థులకు ఇచ్చే ప్రశ్నాపత్రంలో ప్రశ్నలు ఒక వరుస క్రమంలో ఉండవు. అందువల్ల విద్యార్థులు పక్కవారి పేజీలను చూసి సమాధానాలు రాయలనే ఆలోచన వీడాలి. కాపీయింగ్‌కు పాల్పడినా, జేబుల్లో స్లిప్పులు పెట్టుకుని వచ్చినా, పరీక్ష కేంద్రంలో క్షుణ్ణంగా తనిఖీ చేస్తారు. పరీక్ష రాసే సమయంలో ఏ విద్యార్థి వద్ద అయినా స్లిప్పులు కనిపిస్తే పరీక్షల నుంచి డీబార్ చేస్తారు.
- పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు తీసుకురావడంపై ప్రభుత్వం నిషేధం విధించింది. ప్రభుత్వం డీఓలు, ఇన్విజిలేటర్లతో పాటు చీఫ్ సూపరింటెండెంట్ల వద్ద సైతం సెల్‌ఫోన్లు ఉండేందుకు అనుమతిలేదు.



ఒక వేళ విద్యార్థులు ఎవరైనా తమ వెంట సెల్‌ఫోన్లు తెస్తే, వాటిని భద్రపర్చేందుకు పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి ఏర్పాట్లు ఉండవు.

రైలులో టమాటా పంట ఎగుమతికి చర్యలు

రైల్వేశాఖ గుంతకల్లు సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ మనోజ్



మాట్లాడుతున్న రైల్వేశాఖ గుంతకల్లు సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ మనోజ్

మదనపల్లె సిటీ: రైలులో టమాటా పంట ఎగుమతికి అవకాశం కల్పించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు రైల్వేశాఖ గుంతకల్లు సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ మనోజ్, ఆపరేటింగ్ మేనేజర్ శ్రావణ్ తెలిపారు. గురువారం స్థానిక టమాటా మార్కెట్ కమిటీ కార్యాలయంలో మండీ వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మదనపల్లె రోడ్డు (సీటీఎం రైల్వేస్టేషన్) నుంచి దూర ప్రాంతాల మార్కెట్లకు ఎగుమతి చేసేందుకు ప్రత్యేక బోగీ కేటాయిస్తామని చెప్పారు. ఢిల్లీతో పాటు విజయవాడ, నర్సాపురం, భీమవరం తదితర నగరాలకు రవాణా సౌకర్యం అందుబాటులో తీసుకువస్తామన్నారు. రవాణా చార్జీలపై తదుపరి నిర్ణయం తీసుకుంటామని అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ తట్టి శ్రీనివాసులురెడ్డి, కార్యదర్శి అభిలాష్, తిరుపతి స్టేషన్ డైరెక్టర్ సత్యనారాయణ, సీటీఎం రైల్వేస్టేషన్ అభివృద్ధి కమిటీ సలహాదారుడు కృష్ణయ్యవర్మ, మార్కెట్‌యార్డు కమిటీ సభ్యులు, వ్యాపారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కేబుల్ వైరు చోరీ

పెద్దతిప్పసముద్రం : మండలంలోని పట్టెంవాండ్లపల్లి సమీప వ్యవసాయ బోర్లలో రైతులు అమర్చుకున్న కేబుల్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం రాత్రి తమ బోర్ల వద్ద వంద మీటర్ల వైరును కత్తిరించుకెళ్లారని బాధిత రైతులు రామన్న, సురేష్, జనార్దన్‌లు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సమస్యలతో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం మండలంలో జరిగింది. కోటవారిపల్లి పంచాయతీ నార్మాకుల తండాకు చెందిన మల్లప్ప నాయక్ కుమారుడు మల్లేష్ నాయక్ (40) కుటుంబ సమస్యల కారణంగా విషద్రావణం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతడిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తాలూక పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ములకలచెరువు: స్థానిక ఇండియన్ బ్యాంకు ఎదురుగా బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రవీంద్ర (45) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని సోంపల్లి పంచాయతీ జయప్రకాష్ నగర్‌కు చెందిన రవీంద్ర తన సొంత పనులపై బుధవారం రాత్రి తన ద్విచక్ర వాహనంలో ములకలచెరువుకు వచ్చాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు గుంతలో పడి తీవ్రంగా గాయపడ్డాడు. మదనపల్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రవీంద్ర పరిస్థితి విషమించి గురువారం మృతి చెందాడు. రోడ్డు పనులు సరిగా చేయని కాంట్రాక్టర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

భక్తుల కోర్కెలు తీర్చే శ్రీలక్ష్మీనారసింహుడు

- రేపటి నుంచి స్వామివారి బ్రహ్మోత్సవాలు
- 10 రోజుల పాటు ఉత్సవాలు
- ఏర్పాట్లు చేస్తున్న టీటీడీ అధికారులు



బ్రహ్మోత్సవాలకు ముస్తాబవుతున్న ఆలయం



ఆలయంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి వార్లు

గుర్రంకొండ : భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారమై విరాజిల్లుతున్నాడు మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీనారసింహుడు. ఈ నెల16 నుంచి 25 వరకు పదిరోజుల పాటు స్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. ఇందుకోసం టీటీడీ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇదే ఆలయంలోనే శ్రీవెంకటేశ్వర స్వామి భక్తురాలు తరిగొండ వెంగమాంబ ఆలయం కూడా ఉండడం విశేషం.

10రోజుల పాటు బ్రహ్మోత్సవాలు

16న ధ్వజారోహణము, ఊంజల్‌సేవ, హంస వాహనం 17న ముత్యపుపందిరి వాహనం,స్నపన తిరుమంజనం. ఊంజల్‌సేవ, హనుమంత వాహనం, 18న కల్పవృక్ష వాహనం, ఊంజల్‌సేవ, సింహ వాహనం, 19న తిరుచ్చి ఉత్సవం, ఊంజల్‌సేవ, స్నపనతిరుమంజనం, పెద్దశేష వాహనం,20న తిరుచ్చి ఉత్సవం, ఊంజల్‌సేవ, గజవాహనం, 21న తిరుచ్చి ఉత్సవం, సర్వభూపాల వాహనం, కల్యాణోత్సవం, గరుడసేవ, 22న రథారోహణం, రథగమనం, ధూళీ ఉత్సవం, 23న సూర్యప్రభ వాహనం ,ఊంజల్‌సేవ, చంద్రప్రభ వాహనం, అశ్వ వాహనం ,పార్వేట ఉత్సవం, 24న వసంతోత్సవం, స్నపన తిరుమంజనం, చక్రస్నానం, తిరుచ్చి ఉత్సవం, ధ్వజావరోహణం, 25న స్నపన తిరుమంజనం, పుష్పయాగం నిర్వహిస్తారు.

బ్రహ్మోత్సవాలకు టీటీడీ ఏర్పాట్లు

స్వామివారి బ్రహోత్సవాలకు టీటీడీ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఆలయ ప్రాంగణమంతా రంగురంగులతో తీర్చిదిద్దారు.

తొండమనాడు నుంచి స్వామివారి వాహనాలన్నింటిని ఇప్పటికే ఆలయానికి తీసుకొచ్చారు. ఆలయం ముందుభాగంలో మండపాలు, చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. ఆలయంలో కొత్తగా వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. బ్రహ్మోత్సవాల పర్యవేక్షణ కోసం వచ్చే అధికారులకు, సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించే కళాకారుల కోసం అతిథి గృహాలు సిద్ధం చేశారు. గ్రామంలోని స్వామివారి ఆలయం నుంచి బస్టాండు వరకు రోడ్డుకిరువైపులా విద్యుద్దీపాలంకరణ, స్వామివారి చిత్రాలను విద్యుద్దీపాలతో తయారు చేసి ఉంచారు. స్వాగత తోరణాలు ఏర్పాటు చేస్తున్నారు.

మేమంతా జగన్ వెంటే..



ఏపీ టీడీసీ డైరెక్టర్ సాయికిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేస్తున్న యువకులు

ఓబులవారిపల్లె : మేమంతా జగన్ వెంటే ఉన్నామని, వచ్చే ఎన్నికలలో పార్టీ గెలుపు కోసం కృషి చేస్తామని ఓబులవారిపల్లె మండల కేంద్రంలోని యువత ఏపీ టీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి సమక్షంలో గురువారం ప్రతిజ్ఞ చేశారు. మండల కేంద్రంలో వైఎస్సార్ పార్టీ యూత్ శంకర్ రెడ్డి, సాయి, నిఖిల్‌తోపాటు మరికొంత మంది యువత వత్తలూరు సాయికిషోర్ రెడ్డితో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. మొట్టమొదటిసారి ఓటు హక్కు పొందిన యువతకు అవగాహన కల్పించి చైతన్య పరుస్తామన్నారు. తామంతా వైఎస్సార్ పార్టీ వెంటే ఉన్నామని వారు స్పష్టం చేశారు. వైఎస్సార్ పార్టీ నాయకులు మారే సుకుమార్, వెంకటేష్, గోపినాథ్ రెడ్డి, ఎంపీటీసీ దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు



రోడ్డు భద్రతా చర్యలపై సమీక్షిస్తున్న జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

రాయచోటి : జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ రవాణ, పోలీశ్ శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో రోడ్డు ప్రమా దాల నివారణకు చేపట్టాల్సిన భద్రతా చర్యలపై జేసీ అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు రోడ్డు భద్రతా కమిటీలోని ప్రభుత్వ శాఖలన్నీ సమన్వయంతో కృషి చేయాలని జేసీ సూచించారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించాలని, ప్రతి ఒక్క రూ ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రమాదాల బ్లాక్ స్పాట్ ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు, స్టడ్స్, కల్వర్టులు, అండర్ పాస్‌ల వద్ద రేడియం స్టిక్కర్లు, సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం వివిధ అంశాలలో పలు సూచనలు జారీ చేశారు. ఇన్‌చార్జ్ రవాణ శాఖ అధికారి దినేష్ చంద్ర, ఆర్డీఓ రంగస్వామి, డీఎస్పీ మహబూబ్ బాషా, రవాణ శాఖ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు, సహాయ ఇన్‌స్పెక్టర్లు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్ట్

నిమ్మనపల్లె : అక్రమంగా సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ లోకేష్ రెడ్డి తెలిపారు. గురువారం నిమ్మనపల్లె పంచాయతీ నాగంవారిపల్లెలో బయన్న కుమారుడు కందూరి కృష్ణ(58), సారా విక్రయిస్తుండగా అదుపులోకి తీసుకున్నామన్నారు. 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

కాపర్ వైర్ చోరీ



ట్రాన్స్‌ఫారం పగులగొట్టి కాపర్ వైర్‌ను చోరీ చేసిన దుండగులు

సింహాద్రిపురం: మండల పరిధిలోని వై.కొత్తపల్లెలో రైతు ముకుందారెడ్డి పొలంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫారంను దొంగలు పగులగొట్టి కాపర్ వైరు చోరీ చేశారు. రైతు తెలిపిన వివరాల మేరకు... గురువారం తన పొలం పక్కన ఉన్న రైతు అశోక్‌రెడ్డి పొలానికి నీటి తడులు అందించడానికి వెళ్లగా ట్రాన్స్‌ఫారం వద్ద వైర్లన్ని కట్ చేసి ఉండడం గమనించాడు. వెంటనే ఈ విషయాన్ని తెలపగా ముకుందా రెడ్డి పొలం వద్దకు చేరుకున్నాడు. చోరీ జరిగిన విషయాన్ని ఎస్సై అరుణ్‌కుమార్‌కు వివరించారు. కేసు నమోదైంది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు గట్టి చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

సైనిక్ ఫలితాల్లో విశ్వం ప్రభంజనం



విద్యార్థులతో కరస్పాండెంట్, అకడమిక్ డైరెక్టర్

తిరుపతి ఎడ్యుకేషన్: సైనిక్ స్కూల్లో 2024–25 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించిన ప్రవేశ పరీక్ష మొదటి విడత ఫలితాల్లో తిరుపతిలోని విశ్వం విద్యాసంస్థ విద్యార్థులు అత్యుత్తమ ప్రతి భ కనబరిచారు. ఈ సందర్భంగా ఆ విద్యాసంస్థ అధినేత ఎన్.విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ ఈ ఫలితాల్లో తమ విద్యార్థులు 237మంది అర్హత సాధించారని పేర్కొన్నారు. విద్యార్థులను విద్యాసంస్థ కరస్పాండెంట్ తులసి విశ్వనాథరెడ్డి, అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి అభినందించారు.

నవశకం

వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపు రేఖలు నాడు–నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. సొంతంగా సెంటు స్థలం కొనే స్థోమత లేక.. అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

సొంత ఇంటి కలను నెరవేర్చిన సీఎం



నాకు వివాహం అయ్యి దాదాపు ఏడేళ్లయింది. గత ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేయలేదు, ఇంటి స్థలం మంజూరు చేయలేదు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం జగనన్న కాలనీలో ఇంటి స్థలం ఇచ్చి, అందులోనే ఇళ్ల నిర్మాణాని హౌసింగ్ తరపున ఇంటిని కూడా మంజూరు చేయించారు. నాకు ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న సొంత ఇంటి కలను సీఎం జగన్ నెరవేర్చారు.

- కడప గాయత్రి, ఒంటిమిట్ట

ఇంటర్యాక్టివ్ ఫ్లాట్ ప్యానల్‌తో విద్యార్థుల్లో ఏకాగ్రత



ప్రస్తుత ప్రభుత్వ పాఠశాల స్థితి గతులు కార్పొరేట్ కళాశాలలకు మించి ఉన్నాయి. ముఖ్యంగా విద్యార్థులకు ఇంటర్యాక్టీవ్ ఫ్లాట్ ప్యానల్ ద్వారా పాఠాలు చెప్పడంతో వారిలో చెప్పే పాఠాలపై ఏకాగ్రత పెరిగి సులువుగా పాఠాలను అర్థం చేసుకోగలుతున్నారన్నారు. దీని ద్వారా పాఠాలు చెప్పే సమయంలో ఎలాంటి సందేహాలు వచ్చినా ఐఎఫ్‌పీ సహాయంతో వ్యూజివల్‌గా వారి సందేహాలను తీర్చవచ్చు. విద్యార్థుల చదువు కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విశేష కృషి చేసింది.

- వెంకట సుబ్బయ్య, ఒంటిమిట్ట జెడ్పీహెచ్‌ఎస్ ఉపాధ్యాయులు

విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు

మదనపల్లె: విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు టూ టౌన్ సీఐ యువరాజ్ తెలిపారు. మండలంలోని పోతబోలు పంచాయతీ తురకపల్లికి చెందిన షేక్ హజీరా యాస్మీన్ (19) పట్టణంలోని ఓ ప్రైవేటు కాలేజీలో చదువుతోంది. ఈనెల 12వతేదీ ఉదయం ద్విచక్రవాహనంలో కాలేజీకి వెళ్తున్నాని ఇంటి వద్ద చెప్పి వెళ్లింది. అప్పటి నుంచి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు పలు చోట్ల వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో గురువారం తల్లి జరీనా టుటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మదనపల్లె : లారీని ఢీకొని ఓ వ్యక్తి గాయపడిన సంఘటన గురువారం మదనపల్లి పట్టణంలో జరిగింది. తేట్టు పంచాయితీ మూర్తి నాయన పల్లెకు చెందిన రెడ్డి శేఖర్(35), వ్యక్తిగత పనులపై మదనపల్లికు వచ్చాడు. మద్యం తాగి ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడు. మార్గ మధ్యంలోని టిప్పు సుల్తాన్ మైదానం వద్ద ఆగి ఉన్న లారీని ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు బాధితుడిని 108లో ఆసుపత్రికి తరలించారు.

పేకాటస్థావరంపై పోలీసుల దాడి

ముద్దనూరు: తాళ్ల ప్రొద్దుటూరు పోలీసుస్టేషన్ పరిధిలో పోలీసులు గురువారం సాయంత్రం పేకాట స్థావరంపై దాడిచేసి జూదరులను అదుపులోకి తీసుకున్నారు. ట్రైనీ డీఎస్పీ శ్రీకాంత్,ముద్దనూరు సీఐ దస్తగిరి,ఎస్ఐ చంద్రశేఖర్‌లు తమ సిబ్బందితో కలసి పేకాటస్థావరంపై దాడిచేసినట్లు సమాచారం .అనంతపురం జిల్లాకు చెందిన సుమారు 10మంది నిందితులను అదుపులోకి తీసుకుని దాదాపు రూ. 2లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

మదనపల్లెలో భారీ అగ్నిప్రమాదం

- రూ.15 లక్షల విలువైన కలప దగ్ధం
- దెబ్బతిన్న పొరుగిల్లు.. రూ. 10 లక్షల నష్టం
- గురువారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన టూటౌన్ సీఐ యువరాజు



అగ్ని ప్రమాద స్థలంలో వివరాలు సేకరిస్తున్న సిఐ యువరాజు



అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైన కలప

మదనపల్లె : మదనపల్లె పట్టణంలో గురువారం తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం జరిగింది. నష్ట తీవ్రత అధికంగానే ఉన్నా,తక్షణ స్పందనతో ప్రాణం నష్టం జరగలేదు. పట్టణంలోని తారకరామా థియేటర్ సమీపంలోని నర్సింగ్ రూము వీధిలో స్థానికుడైన జహీర్ కొయ్యల మండి నిర్వహిస్తున్నాడు. రెండు ఇళ్ల మధ్య నున్న స్థలంలో కొయ్యల మండి ఉంది. గురువారం తెల్లవారుజామున అకస్మాత్తుగా కొయ్యల మండిలో మంటలు చెలరేగాయి. అక్కడే ఉన్న కలపకు అంటుకొని పెద్ద ఎత్తున మంటలు రేగాయి. మంటల ఉధృతికి పైనున్న రేకులు వేడి చెంది, కిందనున్న కొయ్యలపై పడ్డాయి. దీంతో మరింతగా మంటలు పెద్దవయ్యాయి. ఇంతలో షాపు యజమాని జహీర్ మదనపల్లె ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఇంతలో రంజాన్ ఉపవాస దీక్ష కోసం తెల్లవారుజామునే లేచిన యువకులు అగ్ని ప్రమాదం ఘటనను తెలుసుకొని పెద్ద ఎత్తున స్పందించారు. ఈలోగా మదనపల్లె ఫైర్ స్టేషన్ వాహనంతో పాటు వాల్మీకిపురం నుంచి మరో ఫైర్ వాహనం అక్కడికి చేరుకుంది. రెండు వాహనాలలోని అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా శ్రమించారు. స్థానిక యువకులు పెద్ద ఎత్తున వారికి సహకారం అందించారు. వారం రోజుల క్రితమే జహీర్ ఒక లోడు కలప దింపారు. అగ్ని ప్రమాదంలో కలప మొత్తం పూర్తిగా దగ్ధమై దాదాపు రూ.15 లక్షల మేర నష్టం జరిగినట్లు బాధితుడు జహీర్ చెప్పాడు. అగ్ని ప్రమాదం జరిగిన కొయ్యలమండి పక్కనే ఉన్న ముంతాజ్ అనే మహిళకు చెందిన ఇల్లు అగ్ని ప్రమాదంలో తీవ్రంగా దెబ్బతింది. దాదాపుగా రూ 10 లక్షల మేర నష్టం జరిగిందని ఆమె వాపోయింది. ఉదయం సంఘటనా స్థలాన్ని టూ టౌన్ సీఐ యువరాజు పరిశీలించి వివరాలు సేకరించారు. ప్రమాదానికి సంబంధించిన సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ఎండాకాలంలో అగ్ని ప్రమాదాల నివారణకు ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. మదనపల్లె వాల్మీకిపురం అగ్నిమాపక అధికారులు శివప్ప,రాజగోపాల్, సిబ్బంది విజయ్ కుమార్ రెడ్డి శ్రీనివాసులు బాలాజీ రెడ్డి శేఖర్ రాజేంద్ర ఇమ్రాన్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

'నా భార్య నుంచి కాపాడండి'



పసుపులేటి కిశోర్‌కుమార్

రాయచోటి టౌన్ : 'నా భార్య నుంచి నన్ను కాపాడండి' అంటూ రాయచోటి పట్టణం గాంధి బజారుకు చెందిన పసుపులేటి కిశోర్‌కుమార్ అనే ఉద్యోగి జిల్లా ఎస్పీ కృష్ణారావుకు విన్నవించాడు. గురువారం ఆయన ఎస్పీని కలిసి తన ఆవేదన వ్యక్తం చేశాడు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ టి. సుండుపల్లెలోని మండల పరిషత్ కార్యాలయంలో టైపిస్ట్‌గా పని చేస్తున్నానని తెలిపారు. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డకు చెందిన పోలీస్ ఉద్యోగం చేసే నాగేశ్వరిని 2019లో వివాహం చేసుకున్నానని తెలిపారు. తాను ఉద్యోగ రీత్యా ప్రతి రోజు సుండుపల్లెకు వెళ్తానని తెలిపారు. ఈ సమయంలో భార్య తన భాయ్ ఫ్రెండ్‌తో కలిసి ఉంటోందని పేర్కొన్నారు. ఈ విషయంపై తనతో పాటు తన తల్లి పెంచలమ్మ అభ్యంతరం చెప్పామని తెలిపారు. దీనిని జీర్ణించుకోలేని ఆమె తనతో పాటు తన తల్లిని కూడా అంతమొందించడానికి పథకం పన్నిందని ఆరోపించారు. అందుకోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తోందన్నారు. తాను భయంతో రెండు నెలలు సెలవు పెట్టి రాయచోటి విడిచి వెళ్లిపోయానని పేర్కొన్నాడు. ఎలాగైనా అంతమొందించడానికి ప్రయత్నాలు చేస్తోందని ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు.

విద్యార్థిని అదృశ్యం

మదనపల్లె: పట్టణంలోని ఓ ప్రైవేట్ స్కూల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని అదృశ్యమై, రాత్రికి రాత్రే బాలిక ఆచూకీ లభించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని బసిన కొండకు చెందిన పదవ తరగతి విద్యార్థిని (16), ఈనెల 12వ తేదీ ఉదయం సైకిల్ పై పాఠశాలకు వెళ్లింది. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందారు.

ఈ క్రమంలో తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశారు. 13వ తేదీ బుధవారం బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేశారు. కేసు విచారణ లో భాగంగా తాలూకా ఎస్సైలు రవికుమార్ వెంకటేష్ సదరు ప్రైవేట్ స్కూల్ కి వెళ్లి సిసి ఫుటేజ్ పరిశీలించారు. బాలిక సైకిల్ పై స్కూల్ నుంచి వెళ్లిపోయినట్లు గుర్తించారు. పరిసర ప్రాంతాల్లో గాలించగా బసినికొండ సచివాలయం వద్ద రోడ్డు పక్కన బాలిక వాడిన సైకిల్‌ను గుర్తించారు. విచారణ వేగవంతం చేశారు. దీంతో అదే రోజు రాత్రి బాలిక ఆచూకీ లభ్యమయింది. బాలికను స్టేషన్‌కు తీసుకువచ్చారు. బాలిక అదృశ్యానికి ప్రేమ వ్యవహారమే కారణమని తెలిసింది.

నీటి గుంతలో పడి యువతి మృతి



భారతి (ఫైల్)

మదనపల్లె : నీటి గుంతలో పడి యువతి మృతి చెందిన సంఘటన గురువారం మదనపల్లి మండలంలో జరిగింది. పెంచుపాడు పంచాయతీ పందివారిపల్లెకు చెందిన మల్లికార్జున శాంతమ్మ దంపతుల కుమార్తె కె.భారతి (20) కొంతకాలంగా మానసిక సమస్యలతో ఇబ్బందులు పడుతోంది. రెండేళ్ల క్రితమే తల్లిదండ్రులు మృతి చెందడంతో ఇంటర్మీడియట్ చదువుతున్న తన తమ్ముడు శివశంకర్ తో కలిసి గ్రామంలో ఉంటోంది. అక్క జ్యోతి, బావ రెడ్డి ప్రసాద్ వారి బాగోగులు చూసుకుంటున్నారు. ప్రతి అమావాస్య, పున్నమి రోజున భారతి తీవ్ర అనారోగ్యానికి గురై, మానసికంగా ఇబ్బందులు పడుతోంది. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన భారతి కనిపించకుండా పోయింది. కుటుంబ సభ్యులు బంధువులు రాత్రంతా చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికారు. ఆచూకీ లభించలేదు. ఉదయం గ్రామ సమీపంలోని చోటు పొలం వద్ద నీటినిల్వ గుంతలో పడి ఆమె మృతి చెంది ఉండటం, పొలం వద్దకు వచ్చిన వ్యక్తులు గుర్తించి గ్రామంలో సమాచారం అందించారు. భారతి మృతి చెందిన విషయాన్ని స్థానికులు తాలూకా పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై మోహన్ నాయక్ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మహా సరస్వతి పూజ



సరస్వతీ దేవి అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న ఆలయ ప్రధాన అర్చకులు

రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ఆలయంలో మహాసరస్వతి పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సరస్వతీ దేవి అమ్మవారికి పూజలు నిర్వహించిన ఆలయ ప్రధాన అర్చకులు, వేదపండితులు ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, జిల్లా దేవాదాయశాఖ అధికారి విశ్వనాథ్, ఆలయ ఈఓ డివి రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలంరెడ్డి దశరధరామిరెడ్డి పాల్గొన్నారు.



అక్షరాభ్యాసానికి హాజరైన విద్యార్థులు